# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...






సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 86 | పేజీలు : 08 | గురువారం | 02-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# కేరళ ప్రజలు చాలా తెలివైనవారు

## కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు: కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రేవంత్ రెడ్డి రోడ్ షో

ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీలేదన్న తెలంగాణ సీఎం


కేరళ ప్రజలు చాలా తెలివైనవారన్న రేవంత్ రెడ్డి

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం.....






2

## మీ సేవ కేంద్రాల్లో ఛార్జీల పెంపు..

ఆయా సర్వీసులపై 50 శాతం మేర పెరిగిన ధరలు

'ఏ' కేటగిరీ కింద వచ్చే సేవలపై ఛార్జీలు రూ.62కు పెంపు

'బీ' కేటగిరీ కింద వచ్చే సేవలపై ఛార్జీలు రూ.80కు పెంపు




2

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ

సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందన్న కిషన్ రెడ్డి

కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని వ్యాఖ్య

విభజన తర్వాత రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలన్న కిషన్ రెడ్డి

## చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!



2

బిల్లుకు చట్టబద్ధత నేపథ్యంలో ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపిన మంత్రి

అయితే కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శ

ఒక రాష్ట్రానికి చట్టబద్ధత కల్పిస్తూ, మరో రాష్ట్రానికి హామీలు విస్మరించడం సరికాదన్న మంత్రి

# ఇది మా యుద్ధం కాదు...

మీరు ఎంత ఒత్తిడి చేసినా ఫలితం లేదు!

ట్రంప్ కు తేల్చిచెప్పిన బ్రిటన్ ప్రధాని

ఇరాన్ తో యుద్ధంలో మిత్రపక్షాలు కలిసి రావడంలేదన్న ట్రంప్

పిరికిపందలు అంటూ తీవ్ర వ్యాఖ్యలు

ఈ యుద్ధంతో తమకు సంబంధం లేదన్న బ్రిటన్ ప్రధాని స్టార్మర్

తమ జాతీయ ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టీకరణ

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ముడిపడిన ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తమ దేశ వైఖరిని కుండబద్దలు కొట్టారు. "ఇది మా యుద్ధం కాదు. ఈ వివాదంలోకి మమ్మల్ని లాగొద్దు" అని ఆయన విస్పష్టంగా ప్రకటించారు. దేశ ప్రయోజనాలకే తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు తేల్చిచెప్పారు. ఇరాన్ తో యుద్ధంలో తమతో కలిసి రావడంలేదంటూ ట్రంప్ ఇటీవల మిత్రదేశాలను "పిరికిపందలు" అంటూ తీవ్రంగా నిందించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత

## అమరావతిపై చంద్రబాబుది డ్రామా

ఇదే మా ప్లాన్ బీ: జగన్

అమరావతిపై అసెంబ్లీ తీర్మానం ఒక డ్రామా అన్న జగన్

రాజధానిపై ప్లాన్-బీ ప్రతిపాదించిన మాజీ సీఎం

మచిలీపట్నం-విజయవాడ-గుంటూరుతో 'మావిగన్' కారిడార్ సూచన

సీఎం, మంత్రులు హైదరాబాద్‌కు షటిల్ సర్వీస్ చేస్తున్నారంటూ విమర్శ

అమరావతి పేరిట లక్షల కోట్ల దోపిడీకి ప్లాన్ చేస్తున్నారని ఆరోపణ

2




హైదరాబాద్ పల్స్,అమరావతి

అమరావతి రాజధాని నిర్మాణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది

ముఖ్యమంత్రి చంద్రబాబు

వింజమూరు సభలో వైసీపీని టార్గెట్ చేసిన సీఎం చంద్రబాబు

కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం

నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తామని హామీ

గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి

చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

హైదరాబాద్ పల్స్,అమరావతి

వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని

2





## సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లేఖ

ఇప్ప చెట్ల పెంపకంపై కొత్త డిమాండ్

తెలంగాణలో 10 లక్షల ఇప్ప చెట్లు నాటాలంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఉద్యమం

ఆయన డిమాండ్‌కు 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మద్దతు

ఇప్ప చెట్ల పెంపకం చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ


పర్యావరణ, ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వివరణ

గిరిజన, గ్రామీణ ప్రజల జీవనోపాధికి ఇప్ప ఉత్పత్తులు కీలకం

2

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం: ట్రంప్

2



## అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారు: పాడి కౌశిక్ రెడ్డి

సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారన్న కౌశిక్ రెడ్డి

కడియం శ్రీహరి ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీత

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఆయనకు టిక్కెట్ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గత ఎన్నికల్లో పోటీ చేసిన కడియం శ్రీహరిని తాము మీరు ఏ పార్టీలో ఉన్నారని సభలో అడిగితే తప్పేమిటని ప్రశ్నించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీలో ఉంటే కేసీఆర్, హరీశ్ రావుపై విమర్శలు ఎందుకు చేశారో చెప్పాలని అన్నారు.సభలో ఆయన కాంగ్రెస్

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

మొదటి పేజీ రువాయి

అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు.దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

## మీ సేవ కేంద్రాల్లో ఛార్జీల పెంపు..

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్రంలో మీసేవ కేంద్రాల్లో అన్ని సేవల ధరలను పెంచారు. ఆయా సర్వీసులపై ధరలను 50 శాతం మేర పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రుసుంను రూ.80కి పెంచారు. జనన ధృవీకరణ పత్రం రుసుం రూ.62 చేశారు. కేటగిరీ 'ఏ' మరియు కేటగిరీ 'బి' కింద వచ్చే దాదాపు అన్ని సేవలపై కూడా ధరలను పెంచింది.ఇప్పటి వరకు 'ఏ' కేటగిరీ కింద కనీస ఛార్జీ రూ.35 ఉండగా, దానిని రూ.35కు పెంచారు. ఇందులో అడంగల్, పహాణీ వంటి తక్షణ సేవలు ఉంటాయి. కేటగిరీ 'బీ' సర్వీసుల ఛార్జీని రూ.80కి పెంచారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రాసెస్ అయ్యే కుల, ఆదాయ ధృవీకరణ వంటి సేవల ధరలు రూ.80కి పెరిగాయి. ఇవి నేటి నుంచి అమల్లోకి వచ్చాయి.మీ సేవ కేంద్రాల నిర్వహణ ఖర్చు పెరిగినందువల్ల ధరలను పెంచాలని నిర్వాహకులు కోరారు. ఈ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ధరల సవరణ చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల ధరల పెంపు చోటుచేసుకుంది.

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం: ట్రంప్

మొదటి పేజీ రువాయి

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు."గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం..

మొదటి పేజీ రువాయి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లేఖ

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో 10 లక్షల ఇప్ప చెట్లు నాటాలంటూ జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించిన ఉద్యమం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా మేలు చేస్తుందన్న ఆయన డిమాండ్‌కు వివిధ పార్టీలకు చెందిన 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మద్దతుగా నిలవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.గత కొంతకాలంగా ఇప్ప పువ్వు, ఇప్ప ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరిస్తున్న అనిరుధ్ రెడ్డి, తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన, ఇప్పుడు ఏకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్ప చెట్ల పెంపకాన్ని ప్రభుత్వమే ఒక ఉద్యమంలా చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఈ డిమాండ్‌కు అనూహ్యంగా పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధుల నుంచి మద్దతు లభిస్తోంది.ముఖ్యమంత్రికి రాసిన లేఖలో అనిరుధ్ రెడ్డి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలోని అర్ధ శుష్క ప్రాంతాల వాతావరణానికి ఇప్ప చెట్లు ఎంతో అనువైనవని, ఇవి కరువును సైతం తట్టుకుని బలంగా పెరుగుతాయని వివరించారు. ఇప్ప చెట్లు నేల సారాన్ని పెంచడంతో పాటు భూక్షయాన్ని సమర్థంగా నివారిస్తాయని, తద్వారా పచ్చదనాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని, అనువైన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇప్ప చెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు.పర్యావరణ ప్రయోజనాలే కాకుండా, ఇప్ప చెట్ల వల్ల సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో లాభాలు ఉన్నాయని అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఇప్ప పువ్వులు, గింజలు గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజలకు ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉపయోగపడతాయని అన్నారు. సమృద్ధిగా పోషక విలువలు, ఔషధ గుణాలున్న ఇప్ప ఉత్పత్తులను ఆహారంగా, స్థానిక వైద్యంలో వినియోగిస్తారని, తద్వారా ప్రజల జీవనోపాధికి, ఆరోగ్య సంరక్షణకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఒక ఎమ్మెల్యేగా ప్రారంభించిన ఈ ఉద్యమానికి అనూహ్య మద్దతు లభిస్తుండటంతో ఇప్ప చెట్ల పెంపకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

## ఇది మా యుద్ధం కాదు...

మొదటి పేజీ రువాయి

సంతరించుకున్నాయి. తమపై ఎంత ఒత్తిడి తెచ్చినా ఫలితం ఉండదని స్టార్మర్ బ్రిటన్ వైఖరిని సుస్పష్టం చేశారు. ఇటీవల ఇజ్రాయెల్-అమెరికా దాడుల అనంతరం, ఇరాన్ కీలకమైన హర్మూజ్ జలసంధిని దిగ్బంధించింది. ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన ఈ మార్గం మూతపడటంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఆకాశాన్నంటాయి. ఈ ప్రభావం బ్రిటన్‌లోని సామాన్యుల జీవన వ్యయంపై కూడా పడుతోందని స్టార్మర్ అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, "నాపై ఎంత ఒత్తిడి వచ్చినా, ఎలాంటి గొడవ జరిగినా నేను కేవలం బ్రిటిష్ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే నిర్ణయాలు తీసుకుంటాను. అందుకే ఇది మా యుద్ధం కాదని స్పష్టం చేస్తున్నా" అని పునరుద్ఘాటించారు.అయితే, బ్రిటన్ పూర్తిగా ప్రేక్షకపాత్ర పోషించబోదని కూడా ఆయన సంకేతాలిచ్చారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు దౌత్యపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా విదేశాంగ మంత్రి యెవెట్ కూపర్ నేతృత్వంలో ఒక అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సదస్సులో వివిధ దేశాల నాయకులతో చర్చించి, జలసంధిలో నౌకల స్వేచ్ఛా రవాణాను పునరుద్ధరించడానికి ఒక ప్రణాళికను రూపొందిస్తామని వివరించారు. "ఈ సమస్యను పరిష్కరించడం అంత సులభం కాదు. ప్రజలతో నేను నిజాయతీగా ఉండాలనుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుత సంక్షోభం ప్రజలపై చూపిస్తున్న ప్రభావాన్ని తగ్గించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకుందని స్టార్మర్ తెలిపారు. ఇంధన బిల్లులపై పరిమితి విధించడం, సెప్టెంబర్ వరకు ఇంధన పన్ను తగ్గింపును పొడిగించడం వంటి చర్యల ద్వారా కుటుంబాలపై భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, ఈ క్లిష్ట సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటో కూటమి నుంచి వైదొలగే అంశాన్ని పరిశీలిస్తున్నారని, నాటోను "కాగితపు పులి" అని విమర్శించారని కూడా వార్తలు వస్తున్నాయి. ఈ సంక్లిష్ట అంతర్జాతీయ పరిణామాల మధ్య, బ్రిటన్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ దౌత్యమార్గంలో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంది.

## అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారు

మొదటి పేజీ రువాయి

ప్రజాప్రతినిధుల వద్ద కూర్చున్నారని, అందుకే అడిగామని వెల్లడించారు. అసలు ఆయన ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే మైనింగ్ కుంభకోణాన్ని హరీశ్ రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని అన్నారు. మైనింగ్ స్కాం మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. హౌస్ కమిటీ వేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న సమస్య ఏమిటని ప్రశ్నించారు.సీఐడీ విచారణకు ఆదేశిస్తామని ప్రభుత్వం చెబుతోందని, మంత్రి మీద సీఐడీ విచారణ వేస్తే న్యాయం జరుగుతుందా అని నిలదీశారు. మంత్రిని అధికారులు విచారించే అవకాశం ఉంటుందా అని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ తనను టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని అన్నారు.

## అమరావతిపై చంద్రబాబుది డ్రామా

మొదటి పేజీ రువాయి

అమరావతిని రూ.2 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణంగా అభివర్ణించిన ఆయన, దీనికి ప్రత్యామ్నాయంగా 'ప్లాన్ బి' పేరుతో 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ ఈ రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడారు.

ఏమిటీ 'మావిగన్' ప్లాన్?

జగన్ వివరించిన 'మావిగన్' ప్రణాళిక ప్రకారం, మచిలీపట్నం నుంచి విజయవాడ (70 కి.మీ.), విజయవాడ నుంచి గుంటూరు (40 కి.మీ.) వరకు విస్తరించి ఉన్న 110 కిలోమీటర్ల కారిడార్‌ను రాజధాని ప్రాంతంగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో ఇప్పటికే 35-40 లక్షల జనాభా నివసిస్తోందని, జాతీయ రహదారి వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని జగన్ గుర్తుచేశారు. అమరావతికి ప్రతిపాదించిన రూ.2 లక్షల కోట్లలో కేవలం 10% నిధులు, అంటే రూ.20,000 కోట్లతో ఈ ప్రాంతంలో రింగ్ రోడ్లు, ఇతర అనుసంధాన మార్గాలు ఏర్పాటు చేస్తే, ఇది సహజంగానే ఒక మెగాసిటీగా, అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన వివరించారు. తన హయాంలో మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభించామని, దానివల్ల ఈ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో అవినీతికి ఆస్కారం తక్కువ కాబట్టే, ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రణాళికను పక్కన పెట్టిందని ఆరోపించారు.

అమరావతి.. అవినీతి రాజధాని

అమరావతిని 'అవినీతి రాజధాని'గా జగన్ అభివర్ణించారు. చంద్రబాబు ప్రభుత్వమే కేంద్రానికి, బ్యాంకులకు ఇచ్చిన లెక్కల ప్రకారం, అమరావతిలో కేవలం రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి కనీస వసతులకే ఎకరానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఈ లెక్కన 50,000 ఎకరాలకు రూ.1 లక్ష కోట్లు, లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయని, ఇది రాష్ట్రాన్ని దివాళా తీయించడానికేనని విమర్శించారు. చంద్రబాబు తన గత, ప్రస్తుత పాలనలో కలిపి ఏడేళ్లలో కేవలం రూ.8,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ వేగంతో ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందని ప్రశ్నించారు.నిర్మాణ వ్యయాల్లో భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నక్షత్రాల సౌకర్యాలతో ఫ్లాట్ నిర్మించడానికి చదరపు అడుగుకు రూ.4,500 ఖర్చయితే, అమరావతిలో రూ.11,000 నుంచి రూ.14,000 వరకు చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, భూమి, జీఎస్టీ మినహాయింపులు ఇస్తున్నా ఇంత భారీ వ్యయం ఎందుకని నిలదీశారు. టవర్ల నిర్మాణం, ఫ్లైఓవర్ల వ్యయాన్ని ఇతర నగరాలతో పోల్చి, భారీ వ్యత్యాసాలను ఎత్తిచూపారు. అమరావతిలో కిలోమీటర్ ఫ్లైఓవర్‌కు రూ.170 కోట్లు చూపిస్తుంటే, తన హయాంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో కేవలం రూ.35 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఢిల్లీలోని కొత్త పార్లమెంట్, తెలంగాణ సచివాలయం కన్నా ఏపీ అసెంబ్లీ, హైకోర్టుల నిర్మాణ వ్యయాలు ఎక్కువగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాయని, వారు అమరావతికి కేవలం షటిల్ సర్వీస్ చేస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు సుదీర్ఘకాలం పాలనలో ఉన్న చంద్రబాబు అమరావతికి ఏం చేశారని, రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు.

## ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది

మొదటి పేజీ రువాయి

మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

హిట్ అండ్ రన్ కంటే దారుణం

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018-19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సంక్షేమ పథకాల వెల్లువ

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం

సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం వంటి పోర్టులు రానున్నాయని తెలిపారు.ఉదయగిరిలో డ్రోన్లు, మానవ రహిత విమానాల తయారీ పరిశ్రమ రాబోతోందని, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారిందని అన్నారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

## కేరళ ప్రజలు చాలా తెలివైనవారు

మొదటి పేజీ రువాయి

విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు.కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఓటు బ్యాంకును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ

# ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

### ఎమ్మెల్యే పిఎసి చైర్మెన్ ఆరెకపూడి గాంధీ





**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01, (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎం.ఐ.జి కాలనీ లో నిర్వహించిన శ్రీ రామాలయం దేవాలయం లో జరిగిన శ్రీ హనుమాన్ విజయోత్సవం మరియు 27 అడుగుల శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు భారతి ఆదర్శ్ రెడ్డి నార్నె శ్రీనివాసరావు ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పీఏసీ చైర్మన్. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27 అడుగుల శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహంను ప్రతిష్ఠించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని , భక్తి శ్రద్ధలతో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందడం జరిగినది, అనంతరం శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు ప్రజలకు ఆధ్యాత్మిక శాంతి, సామాజిక ఐక్యతను అందించే కేంద్రాలుగా నిలుస్తాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భీమ్ రెడ్డి, సత్యనారాయణ, టి.వి. రావు, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు మోహన్ గౌడ్, నాగమణి, ఆదర్శ్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి , సొసైటీ మాజీ డైరెక్టర్లు వెంకట్ రావు, నారాయణ గౌడ్, నీలకంఠం, రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, సంపత్ గౌడ్, చిన్న, రాకేష్ రెడ్డి, కుమార్, భక్తులు, స్థానిక నాయకులు భాస్కర్ ముదిరాజ్, నరేందర్ మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సరస్వతీ విద్యాలయం పాఠశాలలో

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సరస్వతీ విద్యాలయం ఆత్మకూరు (ఎం) పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ విచ్చేసి చిన్నారుల యొక్క ప్రతిభను కొనియాడారు విద్య యొక్క గొప్పతనాన్ని, విశిష్టతను అలాగే క్రమశిక్షణతో ఉండాలని తల్లిదండ్రులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలం మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ మాట్లాడుతూ చదువుతోపాటు సంస్కారం అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రజా ప్రతినిధులుగా అధికారులుగా వివిధ హోదాలలో వేషధారణతో వారి యొక్క ప్రతిభను కనబరిచారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తొౌర విష్ణు మరియు పాఠశాల ప్రిన్సిపల్ పంజాల నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు అలాగే చదువు చెప్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐలయ్య, పేరెంట్స్ కమిటీ చెర్మన్ బూడిద శేఖర్ గౌడ్, ఉపాధ్యాయులు చెరుకు విష్ణు, సుధాకర్, యాసిన్, లలిత, సంతోష, మహేశ్వరి, సంధ్య, మాధవి, కృష్ణవేణి, గంగ, లక్ష్మి, రేణుక, లావణ్య లు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డీ.ఎం.హెచ్.ఓ




**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్, పి హెచ్ సీ మొరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా రోగనిరోధక టీకాల కార్యక్రమం (ఇమ్మునిజేషన్ సెషన్) ను ప్రత్యక్షంగా తనిఖీ చేసి, చిన్నారులకు టీకాలు వేయించే తల్లిదండ్రులతో మాట్లాడి, టీకాల ప్రాముఖ్యత, సమయానికి టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ఎంపీ హెచ్ ఏ (పురుషులు) సూపర్వైజర్లతో సమావేశమై, ప్రస్తుత ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, గ్రామ స్థాయిలో జరుగుతున్న సేవలు, ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సిబ్బందికి పలు ముఖ్య సూచనలు జారీ చేశారు:ప్రతి గ్రామంలో ఆరోగ్య విద్యా కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించాలి సిబ్బంది తమ టూర్ డైరీలను ప్రతిరోజూ సమయానికి పూర్తి వివరాలతో నిర్వహించాలి. నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకలాపాలన్నింటికీ సంబంధించి సరైన డాక్యుమెంటేషన్ ఉండేలా చూడాలి గ్రామ స్థాయిలో నిర్వహించిన సమావేశాలు, శిబిరాలు, అవగాహన కార్యక్రమాలలో పాల్గొన్న ప్రజల వివరాలు, వారి సంతకాలు మరియు చర్చించిన అంశాల నిమిషాలను రికార్డుల్లో నమోదు చేయాలి ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచి, ప్రతి అర్హుడికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలిఅదేవిధంగా డెంగ్యూ, మలేరియా, ఫిలేరియా, జపనీస్ ఎన్సెఫలైటిస్ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ వ్యాధుల నివారణకు సంబంధించిన చర్యలను గ్రామస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు దోమల పెరుగుదలను నివారించే చర్యలు, శుభ్రత, నిల్వ నీటిని తొలగించడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పీఓ (సీహెచ్ఐ) డా. ప్రతాప్, డా. జి. పవని ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని డీఎంహెచ్ఓ తెలిపారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీలో

# పరోక్ష ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మంచిర్యాల్ :** ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. ఏప్రిల్ 4, 2026న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికల దృష్ట్యా బుధవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం, ఎన్నికల వేదికలను స్థానిక ఏసీపీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నోటీసులను ఎన్నికైన కౌన్సిలర్లకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు కూర్చునే ఏర్పాట్లు, సమావేశ మందిరంలో సక్రమంగా అమరికలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సజావుగా జరిగేలా వేదిక, మైక్ వ్యవస్థ, రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్‌కు ప్రత్యేకంగా సూచనలు ఇస్తూ, ఎన్నికల వేదిక పరిసర ప్రాంతాలలో బారికేడింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి రాకపోకలు సులభంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. చట్టం--శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఏసీపీ, సీఐలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎటువంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పరోక్ష ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏసీపీ, సీఐ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజనీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి ఆపరేషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మంథని, ఏప్రిల్ 01 :**
పెద్దపల్లి జిల్లాలోని మంథని పట్టణ ప్రాంతాలలో కంటి చూపుతో సమస్యతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి ఆపరేషన్ శ్రీ వైద్య ఫౌండేషన్ మంథని చైర్మన్ బుద్ధార్తి సతీష్ కుమార్ కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేపించడం జరుగుతుందని శ్రీ వైద్య ఫౌండేషన్ చైర్మన్ బుద్ధార్తి సతీష్ కుమార్ తెలిపారు. మంథని లోని పటేల్ ఐ కేర్ లో ప్రతిరోజు ఉచిత కంటి ఆపరేషన్ కోసం నమోదు చేసుకోగలరు వివరాల కోసం 8978102898, శ్రీ వైద్య ఫౌండేషన్ సెక్రెటరీ క్యాంప్ ఇంచార్జ్ రంజిత్ పటేల్ ఈ నంబర్ కు 9515427254 తెలియజేయగలరని అన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

### రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
రాజీవ్ గృహకల్పలో శ్రీశ్రీశ్రీ మాధవనంద సరస్వతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో మాజీ స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్పర్సన్ రాగం సుజాత యాదవ్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ దంపతుల సొంత ఖర్చులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ షిర్డీ సాయినాథ, మార్కండేయ స్వామి మరియు సంతాన నాగదేవత అమ్మవారి ఆలయంలో విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన మండల పూజా, లక్ష్మీ గణపతి నవగ్రహా స్థాపిత దేవత మూల మంత్ర హోమాలు, ప్రధాన కలశ స్థాపన పూజ కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాగం అనిరుధ్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ తమ కుటుంబాలతో సుఖశాంతులతో.. జీవించాలని ఈ సందర్భంగా ఆ దేవదేవులను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకురాళ్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇబ్బంది పడుతున్న

# విద్యుత్ సిబ్బంది



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామ పరిధిలోని విద్యుత్ స్తంభాలను ఇష్టం వచ్చినట్లుగా నిబంధనలకు విరుద్ధంగా వినియోగం చేస్తున్నారు. గ్రామనికి సంబంధించిన మొత్తం గవర్నమెంట్ విద్యుత్ స్తంభాలకు ప్రసార మీడియాకు చెందిన వైర్లు పూర్తిగా తొలగించాలని, ప్రతి ఒక్క స్తంభానికి అలంకరించిన విధంగా ఉన్నయన్నారు. దీనివల్ల విద్యుత్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, షార్ట్ సర్కుట్ అయి ఉద్యోగులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాలను అడ్డగోలుగా వినియోగించడం పై అధికారులు స్పందించకపోతే తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

# హెడ్గే వార్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన బిజెపి నేత రచ్చ శ్రీనివాస్

**హెడ్గే వార్ మన తెలంగాణ వాసియే**
**జాతీయ వాద ఉద్యమ మహోన్నత నాయకుడు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట హిందూ సమైక్యత కోసం ఆర్ఎస్ఎస్ ను స్థాపించి హిందూ సమాజాన్ని ఏకం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగిన డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ కు ఆయన జయంతి సందర్భంగా రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ తన నివాసంలో చిత్ర పాటానికీ పూల మలాలతో ఘనంగా నివాళులు అర్పించారు. మన తెలంగాణ వారసులే మహారాష్ట్రలోని నాగపూర్ లో 1889 ఏప్రిల్ 1వ తేదీన ఉగాది రోజు జన్మించిన హెడ్గెవార్ కుటుంబం తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామానికి చెందిన వారు కావడం మన తెలంగాణ ప్రజలకు గర్వకారణం అని రచ్చ శ్రీనివాస్ గుర్తు చేశారు. విజయదశమి రోజున 1925లో విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్ ను స్థాపించిన హెడ్గెవార్ అకుంఠిత త్యాగభావకుడని, సమర్థవంతమైన నాయకుడని రచ్చ శ్రీనివాస్ అన్నారు. హిందూ సమాజాన్ని మేలుకొలిపి జాతీయవాద సిద్ధాంతాలను ఉద్బోధించిన ఆయన స్ఫూర్తితో ముందుకు సాగడమే ఆయనకు నిజమైన జయంతి నివాళి అవుతుందని రచ్చ శ్రీనివాస్ అన్నారు.

# కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా భాధ్యతలు చేపట్టిన షేక్ షాజహాన్ పర్వీన్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** కొత్తగూడెం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2026 - 27 ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ - 1 గా పోటీ చేసి ఘన విజయం సాధించిన సీనియర్ మహిళ న్యాయవాది షేక్ షాజహాన్ పర్వీన్ నేడు భాధ్యతలు స్వీకరించారు. గత 16 సంవత్సరాలుగా న్యాయవాదా వృత్తి లో ఉన్న షాజహాన్ పర్వీన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు మొట్టమొదటి ఉపాధ్యక్షరాలు గా గెలిచి చరిత్ర సృష్టించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రధాన అధికారి పలివేల గణేష్ బాబు చేతులు మీదిగా నియమకం పత్రం అందుకున్న పర్వీన్ తనపై నమ్మకంతో తనకు ఓటువేసి గెలిపించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అభ్యున్నతి కోసం న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని షాజహాన్ పర్వీన్ తెలిపారు.

# మంత్రి వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన కరాటే బాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ని రాజ్ భవన్ లోని తన నివాసంలో బుధవారం రాజపేట మండలం రేణికుంట గ్రామానికి చెందిన ఎస్సి సెల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కరాటే బాలు (నీరటి బాల నర్సయ్య) ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. రాజపేట కాంగ్రెస్ నాయకులు కరాటే బాలు, మీర్పేట్ ఫోర్త్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇంజ మల్లేష్, పంజాగుట్ట అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు పి.భాను ప్రకాష్, ఉపాధ్యక్షులు యం.నందు ప్రమోద్ ఇతర కాంగ్రెస్ నాయకులు కలిసిన వారిలో ఉన్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ కు కాటా సవాల్..!

**బుధవారం 10 గంటలకు బీరంగూడ శివాలయంలో పసుపు బట్టలతో ప్రమాణం చేద్దాం రా!!! నువ్వు నీతిమంతుడు అయితే రావాలి?**



**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01 :** పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై తీవ్ర ఆరోపణలు చేశారు. హరీష్ రావు స్క్రిప్ట్ మాట్లాడుతూ అక్రమ భూ కబ్జాలు, వేల కోట్ల అవినీతి చేస్తున్నారని మండిపడ్డారు.

**ప్రధాన ఆరోపణలు**

గూడెం మహిపాల్ రెడ్డి స్థాయి గురించి మాట్లాడటం తప్పు;
హరీష్ రావు స్క్రిప్ట్‌తోనే మాట్లాడతారు.
62, 64, 65, 178, 453 సర్వే నంబర్లలో అక్రమ ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారు;
రెండు లక్షల జీతంతో వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారు?
కాటా కుటుంబం చరిత్ర కలిగినది, ఆస్తులు అమ్ముకుని

**పేదలకు అండగా నిలిచాం;**

కేసీఆర్‌తో మంచి సంబంధాలు.
సవాలు అండ్ ప్రమాణం
రేపు బీరంగూడ శివాలయంలో పసుపు బట్టలతో ప్రమాణం చేద్దాం; కార్యకర్తలు లేకుండా దేవుడు నిర్ణయిస్తాడు. చైర్మెన్ పదవికి డబ్బులు తీసుకున్నావా నిరూపించు; నా సర్పంచ్ పదవి గూడెం, హరీష్ తీసేశారు. రెండు సంవత్సరాల్లో అవినీతి బయటపెడతా; పార్కులు, భూములు కబ్జా చేసిన చరిత్ర నీది.



# ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు.. పూర్తి పారదర్శకతతో సర్వే..**
**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01 :** నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న క్రమంలో.. ఎవరైనా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల పేరుతో ఇల్లు, స్థలాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గ పరిధిలోని వేల మంది పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేయడం జరిగిందని తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సొంత స్థలము ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం, స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తోందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి వీటిని అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో ఇటీవల



ఇందిరమ్మ కమిటీ సభ్యుల పేరుతో కొందరు వ్యక్తులు పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, డివిజన్లలో తిరుగుతూ ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామంటూ వేల రూపాయలు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ చలపతిరావు ను ఆదేశించారు. ఈ అంశంపైన వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అక్రమార్కులకు అధికారులు సహకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో సర్వే జరుగుతుందని.. అతి త్వరలో అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఈ సుజాత, ఏఈ లు పాల్గొన్నారు.

# ఏంటి ఈ నాణ్యత లేని భోజనం

**మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా ?**
**పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, కుల ధృవీకరణ, ఆదాయ, నివాస ధృవీకరణ, రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ సేవ ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా, ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయం, పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్,ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా? అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడక పోవడం , రుచి, నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే




మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చికెన్ షాప్ యాజమాన్యాల ఆందోళనకు మద్దతు వెల్లువ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మహబూబాబాద్ ప్రతినిధి :**
తెలంగాణ లో చికెన్ షాప్ యాజమాన్యాలు ఆందోళన బుధవారం నుంచి మొదలైనది హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ముస్లిం మైనార్టీ నాయకులు పలు వర్గాల ప్రజలు విస్తృతంగా మద్దతు తెలిపారు. చికెన్ షాప్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మహబూబాబాద్ జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీమియా మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో టెండర్లు తీసుకున్న వ్యాపారులకు సరైన కమీషన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రెండు రూపాయల కమీషన్ మాత్రమే ఇవ్వడం వల్ల వ్యాపార నిర్వహణ కష్టసాధ్యమవుతోందని తెలిపారు. పెరుగుతున్న ఖర్చులు, రవాణా భారాలు, కార్మిక వ్యయాలు కారణంగా చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.చిన్న వ్యాపారులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారి సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. చికెన్ షాప్ యాజమాన్యాలకు న్యాయం చేయాలని, సరైన కమీషన్ విధానం అమలు చేయాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వ్యాపారులు పాల్గొని తమ ఐక్యతను చాటారు. సమస్యలు పరిష్కారం కాకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని వారు స్పష్టం చేశారు.



# నాలుగు లేబర్ కోడ్ల అమలును నిరసిస్తూ పలు పనిప్రదేశాల్లో బ్లాక్ డే నిరసనలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 1, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు నిరసిస్తూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టౌన్ మండలంలోని కార్మికుల పలు పని ప్రదేశాల్లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహా కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు.విద్యుత్ సవరణ బిల్లు-2022ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను అమలు చేయమని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కూడ అమలు చేయమని అసెంబ్లీలో హామీ ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలనీ, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంలో కార్మిక వర్గం అంతా ఐక్యంగా సిద్ధపడి ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ పట్టణంలో ఉన్న కార్మికులు, సురేష్, మల్లేష్, శ్రీధర్, రమేష్, పెంటూ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ముల్కలపల్లి గ్రామంలో గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మహబూబాబాద్ ప్రతినిధి :**
డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ డీఎస్. కళావతి జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై, గర్భిణీలకు స్వయంగా పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్ కళావతి జగదీష్, మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం కుటుంబం మరియు సమాజ భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన గర్భధారణ కోసం సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

# నమిలలో యదేచ్ఛగా చెట్ల నరికివేత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం నమిల గ్రామంలో రెవెన్యూ పరిధిలోని చెట్లను యదేచ్ఛగా నరికి వేశారు. పాఠశాల ఆవరణలో గ్రామ పొలిమేరలో గ్రామంలో అక్కరకు వచ్చే, అక్కరకు రాని చెట్లను నరికివేయగా గ్రామస్తుల నుండి వ్యతిరేకత వచ్చింది. ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో జిల్లా కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

# చిలుకోయలపాడులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మహబూబాబాద్ ప్రతినిధి :**
చిలుకోయలపాడు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ బుధవారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న ఆధ్వర్యంలో సుమారు రూ.3.50 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఉడుగుల వెంకన్న,మాట్లాడుతూ, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, బాధితులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాన్యులకు అదిరిపోయే గుడ్‌న్యూస్: పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రం కీలక ప్రకటన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, న్యూఢిల్లీ:**
దేశ వ్యాప్తంగా ఇవాళ కమర్షియల్ గ్యాస్ ధరలు భారీగా పెరగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సామాన్యులు వాడే వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయేమోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రసక్తే లేదని కేంద్ర పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, దేశీయ వినియోగదారులకు పాత ధరలకే ఇంధనం అందుబాటులో ఉంటుందని తెలిపింది.ఇక గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్ ధరలను పెంచే ఉద్దేశం ప్రస్తుతానికి లేదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర పెంచామని తెలిపారు. అయితే, దీని ప్రభావం కేవలం వ్యాపార వర్గాలకే పరిమితం అవుతుందని, సాధారణ గృహ వినియోగదారులపై దీని భారం పడదని అధికారులు తెలిపారు. కమర్షియల్ ధరలు పెరిగినప్పుడల్లా డొమెస్టిక్ సిలిండర్ల ధరలు పెరుగుతాయనేది కేవలం అపోహ మాత్రమేనని కొట్టిపారేశారు. ప్రస్తుతం దేశంలో దాదాపు 2 నెలలకు సరిపడా పెట్రోలియం నిల్వలు అందుబాటులో కేంద్రం క్లారిటీ ఇచ్చింది.

# తెలంగాణలో దోస్తీ.. కేరళలో కుస్తీ.. రేవంత్‌పై రామచందర్ రావు ఫైర్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మెయిన్ డెస్క్:
కేరళ ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు నిప్పులు చెరిగారు. కమ్యూనిస్టులతో తెలంగాణలో దోస్తీ చేస్తూ.. కేరళలో మాత్రం కుస్తీ పడుతున్నారంటూ రేవంత్‌పై రామచందర్ రావు సెటైర్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ, నేతలు కేరళ ప్రజలపై కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు.

**రేవంత్ ఏమన్నారంటే..?**
“కేరళ ప్రజలు తెలివైనవారు, విద్యావంతులు. ఇక్కడి ప్రజలు మతతత్వ శక్తులను అనుమతించరు. అలాంటి వారు అధికారంలోకి రాకుండా లక్ష్మణరేఖ గీశారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారు. కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షాలు గెలవకూడదని ప్రయత్నిస్తున్నారు. భాజపా ఓటు బ్యాంకు పినరయికి బదిలీ అయ్యేలా చేస్తున్నారు. ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి” అని రేవంత్ కోరారు.

# మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చితే సహించేది లేదు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ నియోజకవర్గంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని రక్షించాలనే లక్ష్యంతో గ్రామ సభ తీర్మానాలు ఉపాధి హామీ కూలీల సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం నియోజకవర్గ శాసన సభ్యుల క్యాంప్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. రాజశేఖర్ రెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించగా, మహబూబాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ మురళి నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఉమా నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. కూలీలు, కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే విధానాలను ప్రోత్సహిస్తూ, పేదల జీవనాధారమైన ఈ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాగే మహాత్మా గాంధీ ,పేరును తొలగించే కుట్ర జరుగుతోందని పేర్కొంటూ, దీనికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మున్న జానీ, జిలాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయూబ్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు రియాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ మండలంలో రోడ్డు ప్రమాదం... వ్యక్తికి గాయాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పేరుమండ్ల సంకీస గ్రామానికి చెందిన ఏర్ర మహేందర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం మహేందర్ తన వరి పంటకు నీళ్లు పెట్టి తిరిగి వస్తుండగా వేగంగా వస్తున్న ఒక ఆటో ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మహేందర్‌కు చేతులు, కాళ్లకు గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీరోల్ అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, ఈఎంటీ భిక్షపతి, పైలట్ సాయి కుమార్ ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన మహేందర్‌ను మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు

# డి.హెచ్.పి.ఎస్. జిల్లా అధ్యక్షురాలిగా ఇంజ హేమలత ఎన్నిక




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన దళిత హక్కుల పోరాట సమితి డి.హెచ్.పి.ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలుగా ఇంజ హేమలత ఎన్నిక అయ్యారు. దళిత హక్కుల పోరాట సమితి భువనగిరి జిల్లా రెండవ మహా సభల మోత్కూరు మండలంలో జరుగగా ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, హేమలత సామాజిక న్యాయం కోసం కట్టుబడి పనిచేసే నేత అని పేర్కొన్నారు. దళితుల సమస్యలపై ఆమెకు ఉన్న అవగాహన, పోరాట స్ఫూర్తి సంస్థను మరింత బలపరుస్తుందని తెలిపారు. ఇంజ హేమలత మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ కి సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి లకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో దళితులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా కఠినంగా పోరాడతానని, భూమి, విద్య, ఉపాధి, రిజర్వేషన్ల అమలు వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.

## మహబూబాబాద్ జిల్లా ప్రజలకు

# హనుమాన్ జయంతి శుభాకాంక్షలు


**దేశబోయిన శ్రీనువాస్ యాదవ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా ప్రజలందరికీ హనుమాన్ జయంతి సందర్భంగా డోర్నకల్ పట్టణ యాదవ్ సంఘ నాయకులు దేశబోయిన శ్రీనివాస్ యాదవ్ బుధవారం హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్ శ్రీనివాస్ యాదవ్, మాట్లాడుతూ హనుమాన్ జయంతి పర్వదినం ప్రతి హిందూ భక్తుని జీవితంలో ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. భక్తి, బలం, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిన శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ధర్మం, న్యాయం, నిజాయితీ విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు.ప్రస్తుతం సమాజంలో ఐక్యత, సహనశీలత ఎంతో అవసరమని, హనుమంతుని జీవితం మనకు ధైర్యం, భక్తి, విధేయత, సేవాభావం వంటి గొప్ప విలువలను నేర్పుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ పర్వదినాన్ని శాంతి, సౌభ్రాతృత్వం, భక్తి భావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సత్సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. యువత ఈ పర్వదినం ద్వారా మంచి మార్గంలో నడవాలని, పెద్దల ఆశీస్సులు తీసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని, ప్రతి ఇంటిలో సుఖశాంతులు నెలకొనాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తూ, మరొకసారి జిల్లావాసులందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

# హనుమాన్ జయంతి శోభాయాత్రకు నగరం సిద్ధం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, రంగారెడ్డి :** శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న విజయ యాత్ర నేపథ్యంలో నగరంలో విస్తృతంగా ట్రాఫిక్ మార్పులు అమలు చేయనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఈ శోభాయాత్ర ఏప్రిల్ 2న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగనుంది. భక్తులు భారీగా పాల్గొనే అవకాశం ఉండటంతో, నగరంలో అనేక ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా మళ్లించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. శోభాయాత్ర గౌలిగూడ రామ్ మందిరం నుంచి పారడైజ్ జంక్షన్ వరకు, అలాగే కర్మన్ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి డీఎంహెచ్ఎస్ కోటి వరకు కొనసాగనుంది. ఈ మార్గాల్లో పుత్లిబౌలి, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, గాంధీ నగర్, కవాడిగూడ, సీజీవో టవర్స్, రాణిగంజ్, పట్నీ, పారడైజ్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శోభాయాత్ర చేరుకునే ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. ముఖ్యంగా అబిడ్స్, బ్యాంక్ స్ట్రీట్, ఎంజే మార్కెట్, కాచిగూడ, సుల్తాన్ బజార్, ముషీరాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కఠినంగా అమలు చేయనున్నారు. శోభాయాత్ర చివరి భాగం ఆయా జంక్షన్లు దాటిన వెంటనే డైవర్షన్లు ఎత్తివేయబడతాయని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, అత్యవసరం లేకపోతే ఈ మార్గాలను నివారించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. లక్డీకాపుల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ లేదా ఓల్డ్ సిటీ వైపు వెళ్లేవారు బషీర్‌బాగ్ – హిమాయత్‌నగర్ – నారాయణగూడ ఫ్లైఓవర్ – బర్కత్‌పుర – నింబోలియాడ – చాదర్‌ఘాట్ మార్గాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భారీ జనసందోహం, వాహన రద్దీ దృష్ట్యా ప్రజలు సహకరించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.




## ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు తీపికబురు.. 21 వస్తువులతో 'స్పెషల్ కిట్'!

**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 01, మెయిన్ డెస్క్:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాబోయే 2026–27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో కొత్త నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది.

**ఇక ఒకే రంగు యూనిఫామ్..**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరిలో సమానత్వ భావం పెంపొందించేందుకు ప్రభుత్వం 'ఒకే రాష్ట్రం – ఒకే యూనిఫామ్' విధానాన్ని తీసుకురానుంది. గతంలో పాఠశాలల రకాలను బట్టి వేర్వేరు రంగులు ఉండగా, ఇకపై అన్ని స్కూళ్లలో ఒకే రంగు, డిజైన్ ఉన్న యూనిఫామ్ అమలు చేయనున్నారు. ఇది విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపును ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలలకు ఓ బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువస్తుందని విద్యాశాఖ భావిస్తోంది.

**21 వస్తువులతో కూడిన 'స్పెషల్ కిట్'**

విద్యార్థుల చదువుకు కావాల్సిన సామాగ్రి కోసం తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం 21 వస్తువులతో కూడిన భారీ స్కూల్ కిట్‌ను సిద్ధం చేస్తోంది. ఆ కిట్‌లో మూడు జతల యూనిఫామ్ క్లాత్, షూస్, రెండు జతల సాక్స్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, టై, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్, షార్పనర్, జామెట్రీ బాక్స్, డిక్షనరీ వంటి అత్యవసర వస్తువులు ఉండనున్నాయి. పాఠశాలలు పున:ప్రారంభమయ్యే నాటికే విద్యార్థులందరికీ ఈ కిట్లు అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.




# అప్నా ఘర్ ఆశ్రమానికి రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించిన ఢిల్లీ ముఖ్యమంత్రి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖ గుప్తా, బుధ్‌పూర్‌లోని 'అప్నా ఘర్ ఆశ్రమం'కు రూ.1 కోటి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ నిధులు ఆశ్రమంలోని నివాసితులకు అవసరమైన సంరక్షణ సేవలను అందించడానికి ఉపయోగపడతాయి.ఢిల్లీ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో, ముఖ్యమంత్రి శ్రీమతి రేఖ గుప్తా, 'అప్నా ఘర్ ఆశ్రమం' ప్రతినిధులకు చెక్కును అందజేశారు. ఈ ఆర్థిక సహాయం, ఆశ్రమంలో ప్రస్తుతం ఉన్న వందలాది మంది నిరాశ్రయులకు, వృద్ధులకు, మరియు ఇతర బలహీన వర్గాల వారికి ఆశ్రయం, వైద్య సంరక్షణ, మరియు రోజువారీ అవసరాలను తీర్చడానికి ఉద్దేశించబడింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత. అప్నా ఘర్ ఆశ్రమం చేస్తున్న సేవలు ప్రశంసనీయం. వారి కార్యకలాపాలకు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది' అని తెలిపారు.'అప్నా ఘర్ ఆశ్రమం' నిర్వాహకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అందించిన ఈ సహాయం తమకు ఎంతో విలువైనదని, దీని ద్వారా మరిన్ని సేవలను విస్తరించగలమని తెలిపారు. ముఖ్యంగా, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, మరియు పునరావాస కార్యక్రమాలపై దృష్టి సారిస్తామని వారు పేర్కొన్నారు. ఈ విరాళం, ఆశ్రమంలోని అత్యంత దుర్బలమైన వారికి ఆశాకిరణంగా నిలుస్తుందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని భావిస్తున్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని పలువురు అభివర్ణించారు.



## దళిత క్రైస్తవుల ఆందోళన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం క్రైస్తవ పాస్టర్ లు దళిత క్రైస్తవులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత క్రైస్తవ పాస్టర్లు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మాకు నష్టం కలిగించే విధంగా ఉంది. అని నిరసన తెలియజేస్తున్నాం అని అన్నారు. 1950లో రాష్ట్రపతి ద్వారా ఇచ్చిన ఉత్తర్వులు మూడు దఫాలుగా మార్చినారు. అని అన్నారు. మొట్టమొదటిగా హిందూ దళితులే రిజర్వేషన్లు పొందాలి అని ఉన్న ది. కానీ 1956 సిక్కు మతంలో మార్పు చేసినారు. అదేవిధంగా 1990లో బౌద్ధ మతంలో దళితులకు వెసలుబాటు ఇచ్చారు. అదే చట్టం మాకు ఎందుకు వర్తించదు. క్రైస్తవంలో ఉన్న మాపై ఉన్న అంటరానితనం చిన్న చూపు పోలేదు. ఇది సుప్రీంకోర్టు ఒక కమిటీ వేసి మాల, మాదిగ క్రైస్తవుల వాడలో తిరిగి మా జీవన విధానం పై అధ్యయనం చేసి మాకు దళిత క్రైస్తవులకు దళిత హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు.ఈ కార్యక్రమములో రెవరెండ్ పొన్నాల జయానంద్, రెవరెండ్ జి.విల్సన్, రెవరెండ్ సొలొమోను రాజు, రెవరెండ్ ప్రిన్స్ సుప్రీమ్, రెవరెండ్ రాజేష్ పాల్, రెవరెండ్ తిమోతి, రెవరెండ్ నిరీక్షణ్, రెవరెండ్ జాషువా, పాస్టర్ చంద్రశేఖర్, పాస్టర్ నతానియల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**అక్రమ ఇసుక రవాణా పై నిఘా. 3 ట్రాక్టర్లు సీజ్**
**జిల్లా పాలనాధికారి హరిత**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్ పెద్ద వాగు నుంచి రెబ్బెన మండలం రాంపూర్ గ్రామానికి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం ఆసిఫాబాద్ పరిధిలో తనిఖీల్లో మరో నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు.జిల్లా కలెక్టర్ హరిత ఆదేశాల మేరకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా సహజ వనరులను దోపిడీ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు కూడా సమాచారం అందించాలని సూచించారు.

## స్మశాన వాటికకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాము

**పిఎసి ఛైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడా లో గల స్మశాన వాటిక ను మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు ఉప్పలపాటి శ్రీకాంత్ రవీందర్ ముదిరాజు తో కలిసి పరిశీలించిన పిఎసి ఛైర్మన్. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగూడా స్మశాన వాటిక ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ ను నిర్మిస్తామని, ప్రహరీ గోడ ను పునరుద్దరిస్తామని, స్మశాన వాటిక ను సకల సదుపాయాలతో ,అన్ని హంగులతో సుందరవనంగా మరో మహా ప్రస్థానం లాగా చేపట్టడం జరుగుతుంది అని అని, అదేవిధంగా స్మశాన వాటిక లో ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణం కలిపించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగినది అని, మనిషి మరణాంతరం చివరి దశలో అంత్యక్రియలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రకాల వసతుల కలిపించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సమత వేదిక అధ్యక్షునిగా జె. జయరాజ్ ఎన్నిక





**జహీరాబాద్ ఏప్రిల్ 01 హైదరాబాద్ పల్స్ న్యూస్:**
ఏప్రిల్ నెల మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సమతా వేదిక కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రిజర్వేషన్ల పితామహుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంటే భారత దేశ చరిత్ర లో ఒక సుదీర్ఘ అధ్యాయం.భారతదేశంలో అత్యధిక కాలం కేంద్రమంత్రిగా పనిచేసినఅపజయంలేని రాజకీయనాయకుడు డా బాబు జగ్జీవన్ రామ్ ,దేశానికి చేసిన సేవలను,దళిత జాతికి చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ, ఆయన ఆశలను కొనసాగింపుగా ఈ కమిటీ జహీరాబాద్ నియోజకవర్గ ప్రాంతంలో ఆ మహనీయుని ఆశయ సాధనాలకు ఈ కమిటీ కృషి చేస్తుందని ఎన్నిక కాబడిన అధ్యక్షులు జె జయరాజ్ పేర్కొన్నారు. ఈ కమిటీలోని సభ్యులుగా... జె. జయరాజ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బి.భాస్కర్ మాజీ జడ్పీటీసీ, ఏ.రామచందర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు, కార్యదర్శులు సురేష్ మాజీసర్పంచ్,మూర్జల్, కోశాధికారి అశోక్ కుమార్ లు లీగల్ అడ్వైజర్స్.. సొలొమోన్, సందీప్ కుమార్, నతానియల్, చిరంజీవి, ప్రిన్స్, డింపుల్ కార్తీక్ లు ఎన్నికయ్యారు.ఈకార్యక్రమంలో వై. స్వామి దాస్ మాజీ సర్పంచ్,యం.స్వామి దాస్ మాజీ సర్పంచ్, శివకుమార్, చిన్న, సొలోమోన్, జాన్సన్, ధనరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాచౌక్ లో పాల్గొన్న మల్లపురం కురుమ సంఘం నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దొడ్డి కొమరయ్య కురుమ భవనం ను ఆంధ్ర విద్యాసంస్థ నారాయణ సంస్థలకు అద్దకు ఇవ్వడం ను నిరసిస్తూ రాష్ట్ర కురుమ నాయకులంతా చేపట్టిన ధర్నాలో మల్లపురం కురుమ సంఘం నాయకులు కర్రె చంద్రశేఖర్ , సిద్ధప్ప, ఒగ్గు శ్రీనివాస్, గౌడ శ్రీశైలం, కర్రె నాగరాజు, మోటే శేఖర్, కర్రె అనిల్, మల్లేష్ టాడ్

## నాలుగు నెలలకె పగుళ్లు పట్టిన సీసీ రోడ్డు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సిసి రోడ్డు వేసి నాలుగు నెలలు గడవకముందే పగుళ్ళు ఏర్పడి నాణ్యతను వెక్కిరిస్తున్నాయి. రాజపేట మండలం నమిల గ్రామంలో హరిజనవాడలో ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్డును నాలుగు నెలల క్రితం వేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కాగా పెద్ద ఎత్తున పగుళ్లు ఏర్పడడంతో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఈ విషయం పై సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఏప్రిల్ 4 నుంచి లాక్ డౌన్..?

# సంచలన నిర్ణయం దిశగా పాకిస్థాన్ ప్రభుత్వం.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01:**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. 33 రోజులుగా ఇరాన్- ఇజ్రాయెల్- అమెరికా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఓ వైపు చర్చలు అంటూనే మరోవైపు దాడులకు పాల్పడుతోంది అమెరికా. పశ్చిమాసియాలో సైన్యాన్ని మోహరించింది. ఇక ఇరాన్ సైతం ప్రతీకార దాడులను వేగవంతం చేసింది. అమెరికా భూతల దాడులు చేస్తే టెక్ సంస్థలపై దాడులు చేస్తామని ఇరాన్ సంచలన వార్నింగ్ ఇచ్చింది. ఇక యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దాంతో ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో మునిగిపోయాయి. ఈ క్రమంలో అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న పాకిస్థాన్ పరిస్థితి ఇప్పుడు పెనంలోంచి పొయ్యిలో పడినట్లుగా ఉంది.తాజాగా పాకిస్థాన్ లో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. వినియోగదారుల సూచీ గణనీయంగా పెరిగింది. ఫిబ్రవరిలో ద్రవ్యోల్బణం 7 శాతం ఉండగా మార్చి పూర్తయ్యేనాటికి 7.3 శాతానికి చేరింది. ఇక ఈ ఏడాది జనవరిలో పాకిస్థాన్ లో ద్రవ్యోల్బణం రేటు కేవలం 5.8 శాతంగా ఉంది. యుద్ధం ప్రారంభం నుంచి క్రమంగా ఆదేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో నిత్యావసర ధరలు పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.మరోవైపు పాకిస్థాన్ లో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 321 గా ఉంది. అలాగే లీటర్ డీజిల్ ధర 335 గా ఉంది. ఇక తాజాగా కిరోసిన్ ధరను దేశ ప్రభుత్వం పెంచింది. దాంతో లీటర్ కిరోసిన్ ధర పాకిస్థాన్ లో ప్రస్తుతం 433 కు చేరింది. ఈ నేపథ్యంలో ఇంధన సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కేంద్ర ప్రభుత్వం వీకెండ్ లాక్ డౌన్ ను ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరించాయి. వీకెండ్ లాక్ డౌన్ నిర్ణయానికి నో చెప్పడంతో రాష్ట్రాల నుంచి మద్దతు లేక కేంద్రం ఈ ప్రదిపాదనను పక్కన పెట్టినట్లు సమాచారం.పాకిస్థాన్ లో ద్రవ్యోల్బణం, ఇంధన సంక్షోభం కారణంగా ఏప్రిల్ 4 లేదా 5 నుంచి స్మార్ట్ లాక్ డౌన్ ప్రారంభం అవుతుందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ స్మార్ట్ లాక్ డౌన్ లో భాగంగా వీకెండ్ అంటే శని, ఆదివారాల్లో మార్కెట్లు మూసివేత, పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు నిషేధం, బహిరంగ సభలు, సమావేశాలు నిషేధం, రవాణాపై ఆంక్షలు.. ఇలా కొన్ని



నిబంధనలతో ఓ ముసాయిదాను రూపొందించారు అధికారులు.ఈ మేరకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కూడా జరిగింది. అయితే ఈ సమావేశంలో కేంద్రం ప్రతిపాదించిన వీకెండ్ లాక్ డౌన్ ను రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరించాయి. అయితే యుద్ధం ముగిసేందుకు ఇంకా మరిన్ని రోజులు పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని పాకిస్థాన్ ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

### పాక్ ఉగ్ర బంధం బట్టబయలు..


# హఫీజ్ సయీద్ కొడుకుతో ప్రధాని సలహాదారు భేటీ..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01 :**
తీవ్రవాదానికి నిలయమైన పాకిస్తాన్ బుద్ధి మరోసారి బట్టబయలైంది. ఇటీవల ఫైసలాబాద్‌లో లష్కర్-ఎ-తైబా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ హఫీజ్ సయీద్ కుమారుడితో పాకిస్తాన్ ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ సహాయకుడు కరచాలనం చేస్తూ కనిపించారు. దీనికి సంబంధించిన ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.ఇది పాకిస్థాన్ రాజకీయ నాయకత్వానికి, నిషేధిత ఉగ్రవాద సంస్థలకు మధ్య ఉన్న గాఢ సంబంధాన్ని మరోసారి బట్టబయలు చేసింది. 26/11 ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి అయిన హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్‌తో కలిసి ఫైసలాబాద్‌లో జరిగిన ఒక వివాహ వేడుకలో షరీఫ్ రాజకీయ వ్యవహారాల సలహాదారు రాణా సనావుల్లా ఉన్న ఫోటో ఒకటి బయటపడింది.వారిద్దరూ కలిసిన కచ్చితమైన తేదీ తెలియకపోయినప్పటికీ, ఆ ఉన్నత స్థాయి సామాజిక కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ చిత్రాలలో సనావుల్లా, తల్హా సయీద్ వేదికపై బహిరంగంగా మాట్లాడుకుంటూ, కరచాలనం చేసుకుంటూ కనిపిస్తున్నారు.హఫీజ్ సయీద్ భారతదేశం మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులలో ఒకడు. 2008 ముంబై దాడుల నుండి పుల్వామా బాంబు దాడి వరకు జరిగిన పలు దర్యాప్తులలో ఇతని పేరు ఉంది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇతనికి ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉందని ఆరోపిస్తూ అనేక కేసులు నమోదు చేసింది.పాకిస్థాన్‌లో పనిచేస్తున్న 15 ఉగ్రవాద గ్రూపులను, వాటిలో చాలా వరకు భారతదేశాన్ని లక్ష్యంగా



చేసుకున్నాయని ఒక అమెరికా నివేదిక వెల్లడించిన కొద్ది రోజులకే ఈ ఘటన జరగడం, పాక్ చుట్టూ నెలకొన్న నిరంతర ప్రపంచ భద్రతా ఆందోళనలను స్పష్టం చేస్తోంది.సంవత్సరాల తరబడి సైనిక చర్యలు, విధానపరమైన చర్యలు చేపట్టినప్పటికీ, ఉగ్రవాద సంస్థలు "పాకిస్తాన్ గడ్డపై చురుకుగానే ఉన్నాయి" అని కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ ఇటీవల వెలువరించిన ఒక నివేదిక నొక్కి చెప్పింది.2008 ముంబై దాడులకు బాధ్యత వహించిన లష్కర్-ఎ-తైబా, 2001లో భారత పార్లమెంటుపై జరిగిన దాడితో సంబంధం ఉన్న జైష్-ఎ-మొహమ్మద్ వంటి భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్న అనేక గ్రూపులు పాకిస్థాన్‌లో చురుకుగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఈ ఉగ్రవాద గ్రూపులు పాకిస్థాన్‌ను స్థావరంగానూ, లక్ష్యంగానూ వాడుకుంటున్నాయని కూడా నివేదిక పేర్కొంది.

## రఘునాథపురంలో పెద్దమ్మ తల్లికి పూజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామ సంరక్షకురాలు పెద్దమ్మ తల్లి కి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, మహిళలచే కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ, ఆభరణాల ఏర్పాటు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు జరగగా, పురోహితుడు చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు విశేషంగా కొనసాగాయి.

## ప్రభుత్వ వైద్య సేవలను ఉపయోగించుకోవాలి... సర్పంచ్ కొండ ప్రమీల



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని రాజపేట మండలం సింగారం గ్రామ సర్పంచ్ కొండ ప్రమీల పండరి కోరారు. ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. హెల్త్ క్యాంప్ లను అందరూ వినియోగించుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. అందరికీ బిపి, షుగర్ క్యాన్సర్, టీబీ రక్త పరీక్షలు చేసి వైద్యులు మందులు అందజేశారు. ఉపసర్పంచ్ కరుణాకర్, డాక్టర్ మోసెస్ రాజ్, భీకు నాయక్, ప్రేమలత, పంచాయతీ కార్యదర్శి రాజమహేందర్ రెడ్డి, ఉషా రాణి, సులోచన గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ ల అమలును వ్యతిరేకిస్తూ బ్లాక్ డే గా పాటించిన కార్మికులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మికులను యాజమాన్యాల ముందు బానిసలుగా చేస్తాయని, శ్రమ దోపిడీకి గురిచేస్తాయని ఐ.ఎఫ్.టి.యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.జనార్ధన్ ఆరోపించారు. ఏప్రిల్ ఒకటి నుండి 4 లేబర్ కోడ్ లను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఐ.ఎఫ్.టి.యు జాతీయ కమిటీ, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ లు ఇచ్చిన పిలుపు మేరకు రాజపేట మండల కేంద్రంలో ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో బ్లాక్ డే గా పాటించి నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్, శ్రీశైలం లు మాట్లాడుతూ... బీజేపీ మోడీ ప్రభుత్వం బడా కార్పోరేట్ సంస్థలకు కార్మికుల రక్త మాంసాలను దోచిపెట్టడానికి, కార్మిక చట్టాలను, హక్కులను, స్వేచ్ఛను హరించివేయడానికి పూనుకున్నదని, నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేసి బీజేపీ కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో దయ్యాల సిద్ధులు, బుగ్గ నరసింహులు, జూకంటి చంద్రయ్య, ఎర్ర గోకుల రంజిత్, ఎమ్మ బాలరాజు, బుగ్గ కొమురయ్య, బచ్చలి నరసింహులు, ఎమ్మ బీరప్ప, కోయ బాబు, పుప్పాల మల్లయ్య, బైకని బిక్షపతి, బండి సిద్ధులు, మేక ఉపేందర్, గవ్వల బాలయ్య, కాలే నరసింహులు, బండి స్వామి, దయ్యాల రవి, కోయ కృష్ణ, పెద్దోళ్ల కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



### హనుమాన్ జయంతి సందర్భంగా

# జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ

**హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు**

**ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వహించాలి**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, సంగారెడ్డి ప్రతినిధి:** గురువారం నాడు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముందస్తుగా హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర రోడ్డు మార్గాలను ఎస్పీ తనిఖీ చేశారు. శోభాయాత్రలు ప్రశాంతంగా జరగడానికి జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ గారు వివరించారు. జిల్లా నలుమూలల, పలు ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వాహకులకు తెలియజేయునది ఏమనగా ప్రజలు ఇబ్బందిపడే విధంగా పెద్ద శబ్దాలతో కూడిన డీజేలను ఏర్పాటు చేయకూడదని, ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా వివాదాస్పద పాటలు, నినాదాలు, ప్రసంగాలు ఉండకూడదని, ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సహనంగా ప్రవర్తించాలని అన్నారు.సామాజిక మాద్యమాలలో వచ్చే రూమర్లు, అనవసర పోస్ట్ లను నమ్మరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా రూమర్లను ప్రచారం చేస్తే అట్టి వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు. తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

### కోమట్ల మఠంలో విగ్రహాల ప్రతిష్ట

# మహోత్సవం ను ప్రారంభించిన ఆర్య వైశ్యులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో కొమట్ల (ఆరవైశ్య)మఠంలో శ్రీ నగేశ్వర స్వామి సహిత కన్యకాపరమేశ్వరి, విగ్నేశ్వర స్వామి, విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా మహా గౌరీ ఉపాసకులు దింటకుర్తి మురళీ కృష్ణ, పత్రి మఠం ప్రవీణ్ స్వామి ప్రొద్దుటూరి. రమేష్, మాట్లాడుతూ బుధవారం అఖండ దీపారాధన, గంగా సేకరణ, నాంధి ద్వజారోహణ, యాగశాల, తొలి ప్రవేశము, గోపూజ, గణపతి గౌరీ శుద్ధి పుణ్యావాచనము, ఆవాహిత మండపారాధన, విగ్రహ యంత్ర జలాదివాస, ఆవాహిత హోమము, జలాధివాస హోమం, దాన్యాదివాసము హోమము, మహా మంగళహారతులు, విగ్రహ యంత్ర మూల యంత్ర హవనము, రుద్ర హవనము మరియు ధాన్యాధివాస, పుష్పాంచాం, శయ్యాధివాస మహా మంగళ హారతులు, తీర్థప్రసాద తవితరణ అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ- వెంకటేష్, మాజీ సర్పంచులు ఐలయ్య, శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



### తుర్కపల్లి మండలంలో గంజాయితో

# పట్టుబడ్డ ఐదుగురు యువకులు అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01,యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువంగిరి జిల్లా తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదాపూర్ గ్రామ శివారులో గంజాయితో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్లమ్మ గుడి సమీపంలో తనిఖీలు నిర్వహించిన తుర్కపల్లి ఎస్సై, సిబ్బందితో కలిసి అనుమానితులను పట్టుకున్నారు. వారి వద్ద సుమారు 200 గ్రాముల గంజాయి లభ్యమైందని పోలీసులు తెలిపారు. విచారణలో వారు గంజాయిని కలకత్తా నుంచి కొనుగోలు చేసి మాదాపూర్ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.

**నిందితుల వివరాలు:**

ఒగ్గు బాబు, జూకంటి సత్యం, ఒగ్గు నవీన్ కుమార్, జూకంటి శివకుమార్ (మాదాపూర్ గ్రామం), ధీరావత్ దేవేందర్ (వాలు తండ, బొమ్మలరామారం మండలం)గా గుర్తించారు.

**స్వాధీనం చేసిన వస్తువులు:**

200 గ్రాముల గంజాయి, ఒక మోటార్ సైకిల్, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కేసు యాదాద్రి భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్, డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ పర్యవేక్షణలో తుర్కపల్లి ఎస్సై మహమ్మద్ తఖియుద్దీన్ మరియు సిబ్బంది చర్యలు చేపట్టారు.



## హత్య చేసి ఇంట్లో పాతిపెట్టాడు.. దెయ్యం వెంటాడుతోందంటూ లొంగిపోయాడు!

ఛత్తీస్‌గఢ్‌లో ఒక వింత, భయానక ఘటన వెలుగులోకి వచ్చింది. స్నేహితుడిని హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టిన ఓ వ్యక్తి, ఆ తర్వాత అతని దెయ్యం వెంటాడుతోందన్న భయంతో స్వయంగా పోలీసులకు లొంగిపోయాడు. ఈ అసాధారణ సంఘటన అంబికాపూర్ జిల్లాలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధి భగవాన్‌పూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు నిందితుడి సమాచారంతో అతని ఇంట్లో తవ్వకాలు జరిపి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఇటీవల బ్రిజ్‌లాల్ అగరియా (35) అనే వ్యక్తి మద్యం మత్తులో తన స్నేహితుడైన మిథిలేశ్ కుజుర్ (37) ఇంటికి వెళ్లాడు. ఇద్దరం కలిసి మద్యం తాగుదామని పట్టుబట్టాడు. అయితే, శ్రీరామనవమి పవిత్ర సమయం కావడంతో మిథిలేశ్ నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో బ్రిజ్‌లాల్.. మిథిలేశ్ మొబైల్ ఫోన్‌ను పగలగొట్టాడు. ఆగ్రహంతో ఊగిపోయిన మిథిలేశ్, పక్కనే ఉన్న కర్రతో బ్రిజ్‌లాల్‌పై దాడి చేసి తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ నేరాన్ని దాచిపెట్టాలని మిథిలేశ్, అతని భార్య రాజకుమారి (36) నిర్ణయించుకున్నారు. ఇద్దరూ కలిసి తమ ఇంట్లోనే ఒక గొయ్యి తవ్వి, బ్రిజ్‌లాల్ మృతదేహాన్ని అందులో ఉంచి, పైన ప్లైవుడ్ బోర్డుతో కప్పి మట్టి పోశారు. అనంతరం ఆ జంట ఇంటికి తాళం వేసి, బంధువుల ఇంటికి పారిపోయారు. అయితే, కొద్ది రోజులకే మిథిలేశ్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. చనిపోయిన తన స్నేహితుడు దెయ్యం రూపంలో కలలోకి వస్తున్నాడని, తనకు అంత్యక్రియలు చేయాలని డిమాండ్ చేస్తున్నాడని భయంతో వణికిపోయాడు.ఈ భయం, అపరాధ భావనను తట్టుకోలేక, మంగళవారం రాత్రి మిథిలేశ్ స్వయంగా గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయి, జరిగిన నేరాన్ని అంగీకరించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, బుధవారం ఉదయం సిటీ ఎస్పీ రాహుల్ బన్సల్, ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు చూపిన ప్రదేశంలో తవ్వకాలు జరపగా, బ్రిజ్‌లాల్ మృతదేహం బయటపడింది.సిటీ ఎస్పీ రాహుల్ బన్సల్ మాట్లాడుతూ.. "నిందితుడు చెబుతున్న దెయ్యం కథ నమ్మశక్యంగా లేదు. తన నేరాన్ని ఎక్కువ కాలం



దాచిపెట్టలేక, భయం, మానసిక ఒత్తిడితోనే లొంగిపోయాడు. హత్య వెనుక ఇతర కారణాలు కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నాం. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం" అని తెలిపారు. పోలీసులు మిథిలేశ్ కుజుర్, అతని భార్య రాజకుమారిని అరెస్ట్ చేసి, హత్య మరియు సాక్ష్యాలను ధ్వంసం చేసిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తీవ్రమైన అపరాధ భావన ఎంతటి నేరస్థుడినైనా లొంగిపోయేలా చేస్తుందనడానికి ఈ ఘటనే నిదర్శనమని పోలీసులు వ్యాఖ్యానించారు.

## పాటకు పట్టాభిషేకం సందర్భంగా పబ్బోజుకు పురస్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** త్రివేణి సంగమం కల్చరల్ అకాడమీ అధినేత డాక్టర్ రాజారామన్ హైదరాబాద్ లో పాటకు పట్టాభిషేకం ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు డైరెక్టర్ లు ముఖ్య అతిథులు పి. సుశీలమ్మ కూతురు లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజపేట కు చెందిన గాయని పబ్బోజు శోభారాణి కి మహిళ కళ సేవారత్న పురస్కారం అవార్డు అందించారు. శోభారాణి మాట్లాడుతూ ఈ అవార్డ్స్ అందుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉందని, పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## సంగారెడ్డి జిల్లాలో దారుణం... కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య.!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని భరత్ నగర్‌లో బుధవారం నాడు దారుణం జరిగింది. కుమారుడి సాయంతో భార్య తన భర్త తాజుద్దీన్(60) కళ్లల్లో కారం కొట్టి, కర్రలతో చితకబాది చంపేసింది. కుటుంబ కలహాలతోనే చంపినట్లు పోలీసుల విచారణలో తేలింది. మృతుడి స్వస్థలం వికారాబాద్ జిల్లాలోని భూచన్ పల్లిగా గుర్తించారు. కాగా తాజుద్దీన్ భరత్ నగర్‌లో అద్దెకుంటూ కూలీ పని చేస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం జాల గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ స్వీపర్ కేశపురం బుచ్చిరాములు అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం విషయం తెలుసుకున్న జాల మైసమ్మ తల్లి పౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 20,800 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంధమల్ల నవనీత నరసింహులు, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.